పట్టణమంతా పరిశుభ్రం..

మంత్రి కేటీఆర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ శనివారం జిల్లా కేంద్రానికి రానున్న నేపథ్యంలో ప్రధాన కూడళ్లను గ్రీనరీతో పాటు అందంగా ముస్తాబు చేశారు. ఈ పాటికే వన్‌టౌన్‌చౌరస్తా, రాజీవ్ సర్కిల్, అంబేద్కర్‌చౌరస్తా, తెలంగాణ చౌరస్తా, ఆర్‌అండ్‌బీ జంక్షన్, స్టేషన్‌రోడ్డు, న్యూటౌన్, మెట్టుగడ్డ తదితర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ సుందరీకరణ పనులు చేపట్టారు. అప్పన్నపల్లి బ్రిడ్జి నుంచి మొదలుకుని ఆర్టీఓ కార్యాలయం వరకు హైదరాబాద్–రాయచూర్ ప్రధాన రహదారి వెంట, వన్ టౌన్ జంక్షన్ మొదలుకుని భూత్పూర్ వరకు ఉన్న ప్రధాన రహదారితో పాటు నెక్లెస్ రోడ్డుపై ఎక్కడా చెత్తాచెదారం లేకుండా మున్సిపల్ కార్మికులు శుభ్రం చేశారు. ఈ రెండు మార్గాల్లో డివైడర్ మధ్య మొక్కలను ఏపుగా పెంచారు. ఎక్కడ చూసినా పచ్చదనంతో పాటు పరిశుభ్రత కనిపించేలా మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పలు చోట్ల ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసిన కటౌట్లు, బ్యానర్లు, డబ్బాలను సైతం తొలగించారు. మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం పలుకుతూ అన్ని ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ జెండాలు, ఆ పార్టీ నేతల కటౌట్లు, భారీ హోర్డింగ్స్, ఫ్లెక్సీలతో పట్టణమంతా గులాబీమయమైంది.


అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన వివిధ కులవృత్తుల బొమ్మలు


నెక్లెస్ రోడ్డు శుభ్రం చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు


జిల్లా కేంద్రంలో ఫ్లెక్సీల ఏర్పాటు


ప్రభుత్వ బాలుర కళాశాల మైదానంలో సిద్ధమవుతున్న బహిరంగసభ వేదిక

క్లుప్తంగా

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల: పోలేపల్లి సెజ్‌లోని పరిశ్రమల్లో పనులు చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సెజ్ ప్రాంతంలో సీఐటీయూ జెండాష్కరణ చేశారు. నాయకులు మున్న, శ్రీనివాస్, వెంకటయ్య, పెంటయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో జింక మృతి!

మహమ్మదాబాద్: అనారోగ్యంతో ఓ జింక మృతి చెందిన ఘటనిది. వివరాల్లోకి వెళ్తే.. మహమ్మదాబాద్ మండల పరిధిలోని నంచర్ల సమీపంలో జింక మృతి చెంది ఉండడాన్ని గమనించి స్థానికులు అటవీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో సెక్షన్ ఆఫీసర్ నర్సిములు ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనారోగ్యంతో జింక మృతి చెందినట్లుగా నిర్ధారించుకుని, పశువైద్యాధికారి రాం ప్రసాద్‌ను తీసుకెళ్లి జింకకు పోస్టుమార్టం చేయించారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు

గండేడ్: అతివేగం, అజాగ్రత్తతో వస్తున్న ద్విచక్ర వాహనదారు ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొట్టడంతో దంపతులు గాయపడిన ఘటనిది. వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన నాయికోటి అశోక్ తన భార్య మంగమ్మతో కలిసి మహబూబ్‌నగర్‌కు బయలు దేరాడు. గండేడ్ మండలం సల్కర్‌పేట్ వద్దకు రాగానే మహబూబ్‌నగర్ నుంచి కోస్గి వైపు అతివేగంగా, అజాగ్రత్తతో వస్తున్న ద్విచక్ర వాహనదారు అశోక్ ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో అశోక్ దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరుసగా ఢీకొన్న వాహనాలు

జడ్చర్ల: మండల పరిధిలోని చిట్టెంబోయిన్‌పల్లి వద్ద 44వ నంబర్ జాతీయరహదారిపై వరుసగా మూడు వాహనాలు ఒక దాని వెంట మరొకటి ఢీకొన్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న ట్రక్కు, తుఫాన్, కారు వెంట వెంటనే ఢీకొన్నాయి. ఘటనలో వాహనాలు దెబ్బతిన్నాయి. కాగా ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జడ్చర్ల: మండల పరిధిలోని కుర్వగడ్డపల్లి శివారులోని దుందుబీ వాగులో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిన్నచింతకుంట : చిన్నచింతకుంట ఉమ్మడి మండలం ముచ్చింతల గ్రామానికి చెందిన గొల్ల లింగన్న సీతారాంపేట గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం తెల్ల వారు జామున సీతరాం పేట చిన్న వాగునుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు లింగన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మోహన్‌బాబు తెలిపారు.

'అభివృద్ధి పేరుతో మభ్యపెడుతున్నారు'

స్టేషన్ మహబూబ్‌నగర్: అభివృద్ధి పేరుతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నియోజకవర్గ ప్రజలను మభ్యపెడుతున్నారని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డబుల్‌బెడ్‌రూంల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఎంతమందికి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి రమేష్, నాయకులు రాఘవేందర్‌యాదవ్, రమేష్ నాయక్, నరేష్‌బాబు, జాకీర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు కేసీఆర్


రుద్రారంలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నవాబుపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బాంధవుడని జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం మండలకేంద్రంతో పాటు రుద్రారం, కాకర్లపహడ్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మాట్లాడారు. ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, రైతు బంధు మండల చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడా సభ్యుడు చెన్నయ్య, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: కొత్లాబాద్‌లో కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఎంపీటీసీ సత్తయ్య, ఉపసర్పంచ్ వెంకటయ్య, మాధవులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: ఆశిరెడ్డిపల్లిలో వరి కొనుగోలు కేంద్రం శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్ గోపాల్, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, ఏపీఓ హరిశ్చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులు నాణ్యతా ప్రమాణాలను పాటించాలి

మిడ్జిల్: రైతులు తాము పండించిన వరి ధాన్యం విక్రయంచే ముందు నాణ్యత ప్రమాణాలను పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సహకార సంఘం వద్ద కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వర్ష సూచన ఉన్నందువలన రైతులు ధాన్యంపై టార్పాలిన్లు కప్పుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి సిద్దార్థ, విస్తరణ అధికారి భగత్ ఉన్నారు.


మిడ్జిల్‌లో ధాన్యంలోని తేమశాతం పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్

కొనుగోలు కేంద్రాల పరిశీలన

చిన్నచింతకుంట : రైతులు పండించిన వరి ధాన్యానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు చేస్తామని జిల్లా డీసీఓ సుధాకర్ అన్నారు. శుక్రవారం అప్పంపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. రైతులు తూర్పు పట్టే యంత్రాలను వినియోగించాలన్నారు. ధాన్యం తాలు, తేమ లేకుండా తగు జాగ్రతలు వహించి నాణ్యతతో కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలని సూచించారు. జిల్లా సూపరింటెండెంట్ వాసన్న, తహసీల్దార్ బ్రహ్మం, ఆర్‌ఐ జమ్మిల్, అప్పంపల్లి సహకార సంఘం సీఈఓ గోవిందరాజు తదితరులు ఉన్నారు.

హన్వాడ: జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్ యాదవ్ శుక్రవారం కొనగట్టుపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఆర్‌డీఓ యాదయ్య , రైతు బంధు మండల అధ్యక్షుడు రాజు, సింగిల్ విండో చైర్మన్ వెంకటయ్య, సర్పంచ్ చెన్నారెడ్డి, ఎంపీటీసీ చెన్నయ్య, కిష్టయ్య , లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' డబ్బులు చెల్లించాలి

మహబూబ్‌నగర్ రూరల్ : ఉపాధి హామీ కూలీలకు పెండిగ్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం రామచంద్రాపూర్, మాచన్‌పల్లి, పోతన్‌పల్లి, కోటకదిర, అప్పాయిపల్లి గ్రామాలలో ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉంటే అధికార యంత్రాంగం ఏమి చేస్తుందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం పథకాన్ని నిర్వీర్యం చేస్తూ పేదవాడికి అందకుండా చేస్తుందని విమర్శించారు. పని దినాలను 200 రోజులకు పెంచి రోజుకు వేతనం రూ. 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.హన్మంతు, ఆంజనేయులు, రామచంద్రమ్మ, మొగులయ్య, వెంకట్రాములు, లక్ష్మి, శంకర్, రాజమ్మ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మోహన్

బుద్ధుడి బోధనలు ఆచరణీయం


జడ్చర్లలో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

స్టేషన్ మహబూబ్‌నగర్: బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా బౌద్ధ ధర్మసమాజ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో గౌతమ బుద్ధ జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంతంలోని బౌద్ధ ఆలయంలో వందనం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్టేషన్ చౌరస్తాలో అన్నదానం ఏర్పాటు చేశారు. బుద్ధుని బోధనలు అనుసరనీయమని అన్నారు. జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్‌నాగయ్య, ఆది లక్ష్మయ్య, గోపాలకృష్ణ, రామలింగం, అశోక్ కుమార్, సతీష్‌కుమార్, రవికిరణ్, రాములమ్మ పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: బుద్ధ జయంతి పురస్కరించుకుని శుక్రవారం స్థానిక బొటానికల్ గార్డెన్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 3 ఆధ్వర్యంలో బుద్ధుడి విగ్రహానికి ప్రిన్సిపాల్ డా. అప్పియా చిన్నమ్మ, వార్డు కౌన్సిలర్ సతీష్ పూలమాలలు వేసి నివాళులు అర్పించగా యూనిట్ అధికారి డా. సదాశివయ్య, వాలంటీర్లు పూలవర్షం కురిపించారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు స్వీట్లు పంపిణీ చేశారు.


జిల్లాకేంద్రంలో అన్నదానం

హన్వాడ: ప్రతి ఒక్కరూ బుద్ధుని అడుగు జాడల్లో నడుచుకోవాలని బుద్ధ ఆరామ నిర్మాణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణయ్య పేర్కొన్నారు.శుక్రవారం బుద్దారంలో బుద్ధ పూర్ణిమ సందర్భంగా వారోత్సవాలను నిర్వహించారు. వెంకటయ్య, నాగయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

బాలానగర్ : చిన్నరేవల్లి శివాలయ అభివృద్ధికి బీజేపీ రాష్ట్ర నాయకురాలు ఎడ్ల గీతా రూ.3 లక్షల విరాళం అందజేశారు. సర్పంచ్ లక్ష్మికి సదరు డబ్బులు అందించారు. అదేవిధంగా శ్రీరామ ఆలయం స్వంత ఖర్చులతో నిర్మించడంతో పాటు గ్రామంలోని యువకుల కోసం క్రీడా ప్రాంగణం అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోతుల జైపాల్, బత్తుల వెంకటేశ్వర్లు, కోట సుదర్శన్, రొయ్యల సతీష్, సాయి, బత్తుల భరత్ గౌడ్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

బాలానగర్ : బోడజానంపేట్‌కి చెందిన గోపాల్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ భారిన పడి గత సంవత్సరంలో లక్షల రూపాయలు ఖర్చు చేసుకున్నాడు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తోడ్పాటుతో రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును రిలీజ్ చేయించారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ రాజేందర్, పార్టీ గ్రామ అధ్యక్షుడు జగత్ రెడ్డి, నాయకులు పెంటారెడ్డి, నవీన్, సికిందర్ రెడ్డి తదితరులు బాధిత కుటుంబానికి అందజేశారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

కోయిల్‌కొండ: పారుపల్లిలో శనివారం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఆజాదిక అమృత్ మహోత్సవంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు ఆన్‌లైన్ డిజిటల్ లావాదేవీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌బీఐ ఎల్‌డీఎం శ్రీనివాసరావు, బ్యాంకు లీంకేజీ డీపీఎం సల్లోమి, ఏపీఎం విజయ కుమారి, వీవోలు ఆంజనేయులు, గోపమ్మ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ జెండాను తొలగించండి'

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో ఆర్‌అండ్‌బీ నిబంధనలకు విరుద్ధంగా డివైడర్ పై వేయించిన బీఆర్‌ఎస్ పార్టీ కారు గుర్తుతో పాటు, ఏర్పాటు చేసిన జెండాను వెంటనే తొలగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి డిమాండ్ చేశారు. ఈసందర్భంగా శనివారం మండల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రహదారి మధ్యలో డివైడర్ కు ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా గులాబీ రంగులు వేయడం సరికాదన్నారు. బీజేవైఎం రాష్ట్ర లీగల్ కనీ్వనర్ కేశవులు, మండల ప్రధానకార్యదర్శి కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

భూత్పూర్ : సీఎం కేసీఆర్ గీత కార్మికులకు బీమా వర్తింజేసిన నేపథ్యంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు, గీత కార్మికులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో సీఎం కేసీఆర్, అబ్కారీ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, వైస్‌ఎంపీపీ నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

7నుంచి ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ క్రీడలు: కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 7న జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ కార్యదర్శి అబ్దుల్‌జకీ, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీక్ పటేల్, వైస్ చైర్మన్ చెన్న వీరయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై బీఎస్పీ వైఖరి స్పష్టం చేయాలి

మహబూబ్‌నగర్ రూరల్ : రాష్ట్రానికి బీఎస్పీ అధినేత్రి మాయావతి విచ్చేస్తున్న సందర్భంగా ఎస్సీ వర్గీకరణ విషయంలో ఆ పార్టీ వైఖరి ఏమిటో ప్రకటించాలని ఎంఈఫ్ జాతీయ నాయకులు ఎం.వెంకటస్వామి, పి.బాలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడరు. పార్టీ వైఖరి తెలపకుండా తెలంగాణలో ఏ విధమైన బహిరంగ సభలు పెట్టరాదని అన్నారు. కావలి కృష్ణయ్య, ఖాదరయ్య, శ్రీరాములు, కేశవులు, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: ఎస్సీ వర్గీకరణపై బీఎస్పీ అధినేత్రి మాయవతి తమ పార్టీ వైఖరిని స్పష్టం చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ జంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మండల అధ్యక్షుడు సురేష్, బుచ్చయ్య, వెంకటయ్య, గణేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



కోయిల్ కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించేవరకు రిలే దీక్షలు విరమించేదిలేదని జేఏసీ కన్వీనర్ రామునాయక్, కో కన్వీనర్ వెంకట్రామిరెడ్డి శుక్రవారం అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 104 రోజులుగా చేపడుతున్న రిలేదీక్షలకు 15గ్రామాల ప్రజలు మద్దతు తెలుపుతున్నారన్నారు. పెద్ద ఎత్తున రిలేదీక్షలు, నిరసనలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో మండలసాధనసమితి సభ్యులు పాల్గొన్నారు.

కారల్ మార్క్స్ జయంతి

మహబూబ్‌నగర్ న్యూటౌన్ : సోషలిజానికి బాటలు వేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి, సిద్ధాంత కర్త, జర్నలిస్టు కారల్ మార్క్స్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట కారల్ మార్క్స్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ నాయకులు రాజ్‌కుమార్, ఆది విష్ణువర్ధన్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు హెల్త్ చెకప్

జడ్చర్ల టౌన్: కార్మికశాఖ–తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఆధ్వర్యంలో శుక్రవారం బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో హెల్త్ చెకప్ శిబిరం నిర్వహించారు. శిబిరంలో గుర్తింపు కార్డు కలిగిన భవన నిర్మాణ, ఇతర కార్మికులకు 16 రకాల ఆరోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్ ప్రారంభించారు.

కేంద్రం ఇచ్చిన నిధులతోనే అభివృద్ధి

పాలమూరు: జిల్లాకేంద్రం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని, కేవలం కేంద్రం ఇచ్చిన నిధులతో కొంత అభివృద్ధి జరిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేటీఆర్ పర్యటనపై ఆయన మాట్లాడారు. కేంద్రం ఇచ్చిన రూ.100కోట్ల నిధులతో మయూరి పార్క్ అభివృద్ధి జరిగిందని, ఇక రూ.15 కోట్ల రైల్వే స్టేషన్ అభివృద్ధి కాబోతుందని, డబుల్ లైన్ కూడా పూర్తి కాబోతుందన్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు సిరిసిల్లపై ఉన్న దృష్టి పాలమూరుపై లేదన్నారు.

పాలమూరు: భజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని కాంగ్రెస్ పార్టీ కర్ణాటక ఎన్నికల మెనిఫెస్టోలో పెట్టడం సరికాదని, వెంటనే తొలగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి అన్నారు. హిందువులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందని విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట శుక్రవారం ఉదయం ఆందోళన నిర్వహించారు. భజరంగ్‌దళ్‌ను ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్న పాపులర్ ఫ్రంట్‌తో పోల్చడం సరికాదన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో హనుమాన్ చాలిసా పఠించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణవర్ధన్‌రెడ్డి, సత్యం, బురుజు రాజేందర్‌రెడ్డి, అంజయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, శివ, నారాయణ యాదవ్ పాల్గొన్నారు.


కాంగ్రెస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో మాలికా పురుషోత్తమ మాత విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అయ్యప్పసేవా సమాజం అధ్యక్షులు భగవంతురావు, ప్రధాన కార్యదర్శి ముత్యం గురుస్వామి, కోశాధికారి చంద్రశేఖర్ యాదవ్, పంబరాజు, పూజారి హన్మేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్ గౌడ్ తదితరులు

బీఆర్‌ఎస్‌లో చేరికలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : బీఆర్‌ఎస్ పార్టీతోనే తెలంగాణకు శ్రీ రామ రక్ష అని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నవకాంత్, రవి, శివ, సంజీవ్, సుధీర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరవధిక సమ్మె

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తమను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో పంచాయతీ కార్యదర్శుల సమ్మె కొనసాగుతుంది. శుక్రవారం 8వ రోజు జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

మహబూబ్‌నగర్ రూరల్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రెగ్యులర్ కాలేక విధుల్లో పూర్తిస్థాయి నియామకం పొందక రెంటికిచెడిన రేడిలా మారిందని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహమూద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట జేపీఎస్‌లు చేపట్టిన రిలే నిరాహర దీక్షా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు కృష్ణ, ఇతర కార్యదర్శులులో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు.



మహబూబ్‌నగర్‌లో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

- జడ్చర్లలో వంటవార్పు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. సంఘం మండల అధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి అభిలాష్, విజయ్‌కుమార్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.
- బాలానగర్‌లో చేపట్టిన వంటవార్పు కార్యక్రమంలో పలువురు సర్పంచులు కార్యదర్శులకు మద్దతు తెలుపుతూ పాల్గొన్నారు.
- భూత్పూర్‌లో కార్యదర్శులకు మద్దతుగా వారి వారి కుటుంబ సభ్యులు కూడా సమ్మెలో పాల్గొన్నారు. వెంకటేష్, గఫార్, నయూం, సునీల్, రాజేష్, సింధు తదితరులు ఉన్నారు.
- హన్వాడలో బైక్‌లతో కార్యదర్శులు నిరసన తెలిపారు. రెగ్యులరైజ్ చేసేవరకు తమ పోరాటం ఆగదన్నారు.
- గండేడ్‌లో నిర్వహించిన వంటావార్పులో కార్యదర్శులు ఖలీమ్, రాఘవేందర్‌రెడ్డి, రవికుమార్ , వెంకట్‌రాములు, శోభ, మంగమ్మ పాల్గొన్నారు.
- అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో శుక్రవారం సమ్మె జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్ మద్దతు పలికి వంటావార్పు కార్యక్రమానికి రూ.5వేలను కార్యదర్శులకు అందజేశారు. అడ్డాకులలో కన్మనూర్, పెద్దమునుగల్‌చేడ్ సర్పంచులు కార్యదర్శులకు నగదును అందజేశారు.


జడ్చర్లలో వంటవార్పు